
# సర్కారుకు అండగా నిలవాలి

- మాయమాటలు నమ్మితే గోస పడుతాం
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- పెద్దమందడి మండలంలో ఎన్నికల ప్రచారం



పెద్దమందడి మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి, నవంబర్ 15 : ప్రజలు మాయమాటలు చెప్పే వారి మాటలు నమ్మి మోసపోవద్దని, బతుకుదెరువు కల్పించిన కేసీఆర్‌కు అండగా నిలిచి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. మండలంలోని జంగమాయిపల్లి, బలిజపల్లి, పామిరెడ్డిపల్లి, ముందరితండా, చీకర్‌చెట్టు తండా, వీరాయపల్లి, గట్లఖానాపూర్, స్కూల్ తండా, వెల్టూరు, చిలకటోనిపల్లి గ్రామాల్లో బుధవారం మంత్రి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలుమెచ్చారు కాబట్టి తమకు రెండు సార్లు అధికారాన్ని కట్టబెట్టారని మంత్రి పేర్కొన్నారు. బతుకుదెరువు కల్పించిన ప్రభుత్వానికి ప్రజలు మరోసారి అండగా నిలవాలన్నారు. తెలంగాణలో ఇంకా చేయాల్సిన అభివృద్ధి చాలా ఉందని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే మెరుగుపడుతుందని సాగునీరు, విద్య, వైద్యం తదితర వాటిని పెద్దమొత్తంలో కల్పించుకున్నామని తెలిపారు. ఇప్పుడు సాగునీటి బాధ్యత పూర్తికావడంతో రాష్ట్ర ఆదాయం మెరుగ్గా ఉందని, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. తెలంగాణలో పనులు చేసుకునే వారికి చేసుకున్నంత పనులు దక్కుతున్నాయని తెలిపారు. గతంలో తెలంగాణలో పనులు లేక పట్నం, బొంబాయి, దుబాయ్ తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లేవారని కానీ నేడు తెలంగాణలో రాష్ట్రానికి వలసలు పెరిగి జీవనం సాగిస్తున్నారన్నారు. దేశంలో అత్యధికంగా వరి పంట పండే రాష్ట్రంగా తెలంగాణ మొదటిస్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో వానకాలంలో 66లక్షల ఎకరాల్లో వరి సాగైందని, అదే ఆంధ్రా రాష్ట్రంలో కేవలం 38లక్షల ఎకరాల్లో వరిపంట సాగైందన్నారు. నియోజకవర్గంలో ఏఒక్క ఎకరా భూమి బీడు ఉండకూడదని, ఏ ఒక్క మనిషి ఖాళీగా ఉండకూడదనే తపనతో నియోజక వర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీరు తీసుకొచ్చానని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పథకం అందని గడప లేదని, ఏదో ఒక రూపంలో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకం అందుతుందన్నారు. వ్యవసాయాన్ని నిలబెట్టిన ఘనుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. బాగుపడ్డ తెలంగాణను సోల్లు చెప్పే వారి మాటలు విని మళ్లీ రాబందుల చేతిలో పెట్టాలా అని ప్రజలు ఆలోచించి ఓట్లు వేయాలని సూచించారు. ఆంధ్రా పల్లెలకంటే తెలంగాణ పల్లెలు బాగున్నాయని ప్రజలంటున్నారన్నారన్నారు. తెలంగాణలో పండించిన ప్రతి గింజనూ కేసీఆర్ ప్రభుత్వం కల్లాల వద్దనే కొనుగోలు చేస్తుందన్నారు. ఏ గ్రామానికి ఆగ్రామాల్లోనే ధాన్యాన్ని కొనుగోలు చేసి వారి అకౌంట్లతో డబ్బులను ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. 11 సార్లు కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే వారు ఏమి ఒరగబెట్టారని, చెప్పుకోదగ్గ పథకం ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలోకి రమ్మంటే రాకుండా మొఖం చాటేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారం కోసం ఆరాటపడుతుందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కరెంట్ ఎన్ని గంటలు ఇస్తున్నారో, పింఛన్లు ఎంత ఇస్తున్నారో చెప్పాలన్నారు. రానున్న రోజుల్లో పేద కోసం సీఎం కేసీఆర్ రూ.400కే గ్యాస్ సిలిండర్ అందజేస్తారని, అదేవిధంగా ఆసరా పింఛన్లు రూ.5 వేలు, రైతుబంధు సాయం రూ.16వేలు ఇస్తారన్నారు.

### వ్యవసాయ కూలీలతో మంత్రి ముచ్చట్లు

పామిరెడ్డిపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మంత్రి నిరంజన్‌రెడ్డి ముచ్చటించారు. వ్యవసాయం ఎలా ఉందని మంత్రి రైతులను అడుగగా ఇదంతా మీరు సాగునీరు తీసుకురావడం వల్లనే ఇన్ని ధాన్యపు రాశులు వచ్చాయని మేము ఏ పార్టీ వారు వచ్చినా వారిని పట్టించుకోమని, అన్నంపెట్టే రైతన్నలంతా నిరంజన్‌రెడ్డినే గెలిపించుకుంటామని రైతులు చెప్పారు.

### గ్రామ గ్రామాన మంత్రి ఘన స్వాగతం..

మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రికి డప్పు వాయిద్యాలు, మంగళహారతులు, గజమాలలతో ఘనంగా ప్రజలు స్వాగతం పలికారు.

### మంత్రి సమక్షంలో భారీగా చేరికలు

పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన కాంగ్రెస్ , బీఎస్పీ నాయకులు ఆంజనేయులు ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచులు భాగ్యమ్మ, సతీశ్, జయంతి, వెంకటేశ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజాప్రకాశ్‌రెడ్డి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేణు, మాజీ ఎంపీపీ మన్యపురెడ్డి, నాయకులు శశివర్ధన్‌రెడ్డి, జానకిరాములు, శ్రీనివాస్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, గోపాల్‌నాయక్, రమేశ్‌నాయక్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

వనపర్తి రూరల్, నవంబర్ 15 : పని చేసే నాయకుడి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెంటేనే ప్రజలంతా ఉంటారని, అనునిత్యం పార్టీలో చేరుతున్న చేరికలు అందుకు నిదర్శనం అన్ని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాజపేట గ్రామంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజనగరం రామకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో 34మంది, తండా నుంచి 30మంది మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, లోకారెడ్డి, ఎల్లయ్య, పెంటయ్య, అశోక్, సంపత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సతీశ్, శ్రీనివాస్‌రెడ్డి, సేవ్యానాయక్, ఠాకూర్ నాయక్, కురుమూర్తి యాదవ్, రవిప్రకాశ్‌రెడ్డి, రాములయ్య పాల్గొన్నారు.

# ముందుగానే ఓటరు స్లిప్‌లు చేరాలి

- కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



పార్టీల ప్రతినిధులతో ఓటరు స్లిప్‌ల పంపిణీ, పోలింగ్ కేంద్రాల మార్పు పై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

వనపర్తి, నవంబర్ 15 : ఓటరు ఇన్‌ఫర్మేషన్ స్లిప్‌లు నిర్దేశించిన సమయంలో ఓటరుకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల నామకరణం, లోకేషన్ మార్పులకు సంబంధించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి పరిధిలోని పోలింగ్ కేంద్రాల నామకరణం లోకేషన్ల మార్పునకు సంబంధించి సీఈవో హైదరాబాద్‌కు ప్రతిపాదన పంపేందుకు రాజకీయ ప్రతినిధులతో చర్చించి సూచనలు,సలహాలు కోరారు. శ్రీరంగాపురం మండలంలోని కంబాళాపురం గ్రామంలో పోలింగ్ స్టేషన్ నెంబర్ 238ని ఎంపీయూపీఎస్, కమలాపూర్ స్కూల్ భవనంలోకి మార్పు, గోపాల్‌పేట్ మండలంలోని ఆరు పోలింగ్ కేంద్రాలు ఉండడంతో ఎక్కువ ఓటర్లు ఉన్నందున ఇబ్బంది కలగకుండా మరో రెండు పోలింగ్ స్టేషన్‌లను పీఎస్ నెంబర్ 265ను జెడ్పీహైస్కూల్ బాలికల నార్త్ పక్కకు, పీఎస్ నెంబర్ 266ని జెడ్పీ హైస్కూల్ వెస్ట్ సైడ్‌లో మార్పు, గోపాల్‌పేట మండలంలోని ఏదుల గ్రామం పీఎస్ నెంబర్ 284ను జెడ్పీహైస్కూల్ నార్త్ సైడ్‌లోకి, అదేవిధంగా 285ను జెడ్పీ హైస్కూల్ ఏదులకు మార్చుట, అలాగే జిల్లా పరిధిలోని కొల్లాపూర్ నియోజకవర్గనికి చెందిన పోలింగ్ స్టేషన్ 188ని అంగన్‌వాడీ స్కూల్-2 బిల్డింగ్‌కు మార్చుటకు రాజకీయ పార్టీ ప్రతినిధులందరూ ఏకాభిప్రాయంతో అంగీకరించారని తెలిపారు. జిల్లా పరిధిలోని 24 పోలింగ్ కేంద్రాల నామకరణాలతో మార్పులు చేసేందుకు చర్చించారు. అందులో దేవరకద్ర నియోజకవర్గ నుంచి 2 పోలింగ్ కేంద్రాల నామకరణాల మార్పు చేయుటకు, కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి 3 పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు చేయుటకు, వనపర్తి నియోజకవర్గంలోని 17పోలింగ్ కేంద్రాల నామకరణల మార్పులకు ఏకాభిప్రాయంతో అంగీకరించినట్లు తెలిపారు. జిల్లాలో ఓటరు స్లిప్పులు నిర్ధేశించిన సమయంలో ప్రతి ఓటరు ఇంటికి చేరేలా అన్ని ఏర్పాట్లను చేశామని తెలిపారు. ఓటరు స్లిప్పులో ఓటరుకు సంబంధించిన సమాచారం ఉంటుందని, ఓటరు సులభంగా ఓటు వేయవచ్చునని సూచించారు. జిల్లాలో రోజు వారి ఓటర్ స్లిప్ డిస్ట్రిబ్యూషన్ లిస్టులను రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో పద్మావతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎన్నికల బరిలో 13మంది అభ్యర్థులు

- రిటర్నింగ్ అధికారి తిరుపతిరావు

వనపర్తి,నవంబర్ 14 : నియోజకవర్గ బరిలో మొత్తం 14మంది అభ్యర్థులకు గానూ ఒక స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణ తన నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు రిటర్నింగ్ అధికారి తిరుపతి రావు తెలిపారు. మొత్తం 19నామినేషన్లలో ఐదు నామినేషన్లు స్కూట్నీలో తొలిగిపోగా, 14మంది అభ్యర్థులు ఉన్నారు. ఒకరు నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ఎన్నికల బరిలో ఉన్న 13 మంది అభ్యర్థులతో సమావేశమై గుర్తింపు పొందని రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నట్లు తెలిపారు.

## వనపర్తి కారు అసెంబ్లీకి పోవాలె..

- ప్రతి ఇంటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలి
- మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి
- ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

శ్రీరంగాపూర్, నవంబర్ 15 : నియోజకవర్గ అభివృద్ధి కోసం కష్టపడుతున్న సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని వనపర్తి కారు అసెంబ్లీకి పంపించాలని శ్రీరంగాపురం మండలకేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముందుగా ఆయన శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కార్యకర్తుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమని నమ్మి బీఆర్‌ఎస్‌లోకి వచ్చానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి ఆరునెలలకు ఒక సీఎం మారే కాంగ్రెస్ కావాలా.. అభివృద్ధి ప్రదాత కేసీఆర్ ప్రభుత్వం కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మండల నాయకులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం, రైతుల కోసం రైతు బీమా, రుణమాఫీ, రైతుబంధు ,దళిత బంధు, పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు, ప్రతి గ్రామపంచాయతీ బీటీరోడ్డు, తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిరంజన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పలువురు కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, సర్పంచ్ వినీలా రాణి, సింగిల్ విండో అధ్యక్షుడు జగన్నాథం నాయుడు, కర్రె స్వామి, సాయినాథ్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మరోమారు బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలి

- ఐదుసార్లు అవకాశం ఇస్తే ఏం చేశారో జూపల్లిని నిలదీయండి
- కొల్లాపూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పెంట్లవెల్లి నవంబర్15 : కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశాను.. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మరోమారు ఆశ్వీరదిస్తే మరింత అభివృద్ధి చేసుకుందామని కొల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలకేంద్రంలో ఇంటింటికి తిరిగి కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. అంతకు ముందు గంగమ్మ ఆలయం,పెద్దమ్మ(అమ్మమ్మ) ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలు వీధులో కార్యకర్తలు,మండల ప్రజలు ఉత్సాహంగా.. నడువు నడువవే రామక్క...కలిసినడుం కట్టవే రామక్క అనే పాటకు ఎమ్మెల్యే బీరం ప్రజలతో కలిసి ఆడిపాడారు. అనంతరం బీరం మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు చేయలేని అభివృద్ధి పనులను అతి తక్కువ కాలంలో అభివృద్ధి చేసి చూపించానన్నారు. ఐదు సార్లు అవకాశం కల్పించినా ఏం చేశారో జూపల్లిని ప్రజలు నిలయదీయాలని సూచించారు. పంచాయతీరాజ్ ,పరిశ్రమల శాఖా మంత్రిగా ఉండి కొల్లాపూర్ నియోజకవర్గంలో పరిశ్రమలు కాదుగదా.. రోడ్లు కూడా నిర్మించలేక పోయారని మండిపడ్డారు. నేను ఎమ్మెల్యేగా గెలిచిన ఐదేండ్లలో పెంట్లవెల్లిలో జూనియర్ కళాశాల మంజూరు, సబ్‌స్టేషన్ నిర్మాణం, రూ.10 కోట్లతో చౌట చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా నిర్మాణం, ఎంగంపల్లితండా వాగుపై బ్రిడ్జి నిర్మాణంతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తు చేశారు. అదేవిధంగా మల్లేశ్వరంలో రూ.33కోట్లతో మినీ లిఫ్టు ఇరిగేషన్ పనులు ప్రారంభించుకున్నట్లు నేను మాటల మనిషికాదని, చెప్పిన ప్రతిదానికి చేసి చూపించినట్లు ప్రజలకు వివరించారు. అందుకే ప్రజలు బీఆర్‌ఎస్‌గా అండగా నిలచి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం జటప్రోల్, గోప్లాపురం,శింగవరం గ్రామాల్లో ఎమ్మెల్యే బీరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్‌రావు, గౌరారం వెంకట్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల నాయకులు రాజేశ్, సురేందర్‌గౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యులు మతీన్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతుల వేంకటేశ్వర్లు, విండో చైర్మన్ విజయరామారావు తదితరులు ఉన్నారు.

